సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 6 । మార్చి । 2025

కొత్తగూడెంలోని సింగరేణి కళాశాల పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు



లక్ష్మీదేవిపల్లి పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఎస్పీ



అశ్వారావుపేటలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఇంటర్ పరీక్షలు షురూ..

36 కేంద్రాల్లో 9,446 మంది విద్యార్థుల హాజరు

- మొదటి రోజు 493 మంది గైర్హాజరు
- ఐదు నిమిషాల వెసులుబాటు అమలు
- పరీక్ష కేంద్రంలో తనిఖీ చేసిన ఎస్పీ

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు జిల్లాలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకుని రూం నంబర్లను చెక్ చేసుకున్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అన్ని పరీక్ష కేంద్రాలకూ సుమారు అర్ధగంట ముందుగానే వచ్చారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది.. విద్యార్థుల హాల్ టికెట్లను తనిఖీ చేసి లోనికి పంపించారు. వాచీలు, షూ, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్యులు, మందులను అందుబాటులో ఉంచారు. 144 సెక్షన్ అమల్లో ఉండడంతో గుంపులుగా రాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను ముందుగానే మూయించారు. గదుల్లో విద్యుత్, ఫ్యాన్ల సమస్య రాకుండా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. అయితే ఈ ఏడాది పరీక్ష సమయానికి మించి ఐదు నిమిషాలు వెసులుబాటు కల్పించడంతో విద్యార్థుల్లో కొంత ధైర్యం ఏర్పడింది. గతంలో పరీక్ష సమయం దాటితే లోపలికి అనుమతించకపోవడంతో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు వెనుదిరిగేవారు. ఈ ఏడాది సమయం పెంచినా.. దాదాపు అన్ని కేంద్రాల్లోనూ నిర్ణీత సమయానికి ముందే విద్యార్థులు చేరుకున్నారు.

పరీక్షకు దూరంగా 493 మంది..

జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సర జనరల్ విద్యార్థులు 7,532 మందికి గాను 7,284 మంది విద్యార్థులు తొలిరోజు పరీక్షకు హాజరయ్యారు. ఒకేషనల్ గ్రూప్‌నకు సంబంధించి 2,407 మందికి 2,162 మంది మాత్రమే పరీక్ష రాశారు. మొత్తంగా 9,939 మంది విద్యార్థులకు గాను 9,446 మంది పరీక్ష



కొత్తగూడెం సింగరేణి పాఠశాల కేంద్రం వద్ద క్యూ లైన్‌లో విద్యార్థులు

రాయగా, 493 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ వెల్లడించారు.

లక్ష్మీదేవిపల్లిలో ఎస్పీ తనిఖీ..

ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని నలంద జూనియర్ కళాశాల కేంద్రాన్ని ఎస్పీ రోహిత్‌రాజు తనిఖీ చేశారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ వెంట కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు నరేష్, రమణారెడ్డి ఉన్నారు.

ఇకపై ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్, రాగమయి తదితరులు

‘సీతారామ’ ద్వారా ఎన్నెస్పీ ఆయకట్టుకు గోదావరి జలాలు

- మెయిన్ కెనాల్ నుంచి రాజీవ్ లింక్ కెనాల్‌లోకి విడుదల
- పూజలు చేసి మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



గోదావరి జలాలకు పూలు సమర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

జూలూరుపాడు: సీతారామ ఎత్తిపోతల పథకంతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. జూలూరుపాడు మండలం వినోభానగర్ వద్ద సీతారామ కాల్వ నుంచి రాజీవ్ కెనాల్‌లోకి గోదావరి జలాలను ఆయన బుధవారం రాత్రి 9 గంటలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా గోదావరి జలాలకు పూజలు చేసి చీర, సారె సమర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో తుమ్మల మాట్లాడారు.

రూ.100 కోట్లు మంజూరు చేయించా..

గత ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టులో భాగంగా మూడు పంప్ హౌస్‌లను నిర్మించినా నిరుపయోగంగా ఉన్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ డిజైన్‌లో ఏన్కూర్ రాజీవ్ లింక్ కెనాల్ లేకున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం వచ్చినప్పుడు ఒప్పించి రూ.100 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. ఈ కాల్వ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు, వారిని ఒప్పించిన రెండు జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులతో చకచకా పూర్తయిందని తెలిపారు. కాగా, తాను ఏ పార్టీలో ఉన్నా ప్రజలు, రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేశానని వివరించారు. సీతమ్మ సాగర్ నిర్మాణం పూర్తయితే 36 టీఎంసీల నీరు నిల్వ చేయవచ్చని, గోదావరి – కృష్ణా జలాల అనుసంధానంతో సాగర్ ఆయకట్టులో 1.80 లక్షల ఎకరాలను స్థిరీకరించవచ్చని వెల్లడించారు. కాగా, సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ కింద నాలుగో పంప్ హౌస్‌ను అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈమేరకు కెనాల్‌కు భూములు ఇచ్చిన రైతులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, డాక్టర్ మట్టా రాగమయి, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి, నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు, రాధాకిశోర్, మాలోత్ మంగీలాల్ నాయక్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ స్వాతి బిందు, ఇరిగేషన్ అధికారులు శ్రీనివాసరెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు


సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని ఎన్నెస్పీ ఆయకట్టుకు అందించేలా ఏన్కూరు లింక్ కెనాల్(రాజీవ్ కెనాల్) నిర్మాణం చేపట్టారు. తద్వారా జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో 7,500 ఎకరాలు, వైరా రిజర్వాయర్‌తో పాటు సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో మొత్తంగా 1.20 లక్షల ఎన్నెస్పీ ఆయకట్టు గోదావరి జలాలతో స్థిరీకరణ జరగనుంది.

100 కి.మీ. ప్రయాణం

అశ్వాపురం వద్ద గోదావరి నదిపై కాటన్ నిర్మించిన ఆనకట్ట నుంచి నీరు ఎత్తిపోసేలా సీతారామ ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. ఈ పథకంలో భాగంగా అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరు, ములకలపల్లి మండలంలోని వీ.కే.రామవరం, కమలాపురంలలో పంప్‌హౌస్‌లు నిర్మించి మోటార్లు అమర్చారు. అలాగే, ఇప్పటివరకు 100 కి.మీ. మేర కాల్వల తవ్వకం పూర్తయింది. పంప్‌హౌస్‌ల్లో మోటార్లను మూడు రోజులుగా నడిపిస్తుండగా గోదావరి జలాలు బుధవారం సాయంత్రం కల్లా జూలూరుపాడు మండలం నల్లబండబోడు వద్దకు చేరాయి. ఈసందర్భంగా పెద్దసంఖ్యలో హాజరైన గ్రామస్తులతో కలిసి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తదితరులు గోదావరి జలాలకు పూజలు చేశారు. అక్కడి నుంచి సీతారామ మెయిన్ కెనాల్ ద్వారా వినోభానగర్ వద్దకు రాత్రికల్లా జలాలు చేరుకున్నాయి. ఆపై కొత్తగా నిర్మించిన రాజీవ్ లింక్ కెనాల్‌లోకి నీటిని మంత్రి తుమ్మల విడుదల చేశారు. అనంతరం ఏన్కూరు మండలం అక్కినాపురం తండా 52వ కి.మీ. వద్ద ఎన్నెస్పీ(నాగార్జునసాగర్ ప్రాజెక్టు) కాల్వ లోకి బుధవారం అర్ధరాత్రి దాటాక చేరాయి.

ఎనిమిది గంటల పాటు ఎత్తిపోత

అశ్వాపురం: అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్ట్ ఫేస్ –1 పంప్‌హౌస్ నుంచి మూడో రోజైన బుధవారం కూడా గోదావరి జలాలను ఎత్తిపోశారు. పంప్‌హౌస్‌లోని ఒక మోటార్ ద్వారా ఎనిమిది గంటల పాటు 86.4 ఎంసీఎఫ్‌టీ నీటిని దిగువకు విడుదల చేశారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి మూడు పంప్‌హౌస్‌ల ద్వారా ఏన్కూరు లింక్ కెనాల్‌కు, అక్కడి నుంచి ఎన్నెస్పీ కెనాల్‌కు గోదావరి జలాలు చేరుతున్నాయి.



బీజీకొత్తూరు పంప్‌హౌస్ నుంచి దిగువకు ఎత్తిపోస్తున్న నీరు

శ్రీరామనవమి ఏర్పాట్లపై నేడు సమీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకల ఏర్పాట్లపై గురువారం ఉదయం 11 గంటలకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అన్ని రకాల వసతి, సౌకర్యాల కల్పనకు సమగ్ర సమాచారంతో సమావేశానికి రావాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు.

జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందన

కొత్తగూడెంటౌన్: ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు గుంటూరులో జరగనున్న ఆర్చరీ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. పోటీలకు ఎంపికైన ఎం.విక్రమ్ (కొత్తగూడెం), పి.హరీష్(పాల్వంచ), క్రాంతి వర్మ(సుజాతనగర్) ఐడీఓసీలో బుధవారం కలెక్టర్‌ను కలిశారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ పి.పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ పాటిల్

ఇసుకపై ఫోకస్ !

- అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా బాస్‌ల చర్యలు
- పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక నిఘా



పాల్వంచ మండలంలోని చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్ (ఫైల్)

బూర్గంపాడు: మొన్నటి వరకు మూడు లారీలు.. ఆరు ట్రాక్టర్లుగా సాగిన ఇసుక అక్రమ రవాణాపై పోలీస్ శాఖ నజర్ పెట్టింది. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ రంగంలోకి దిగారు. ఇటీవల వారు ఇసుక రీచ్‌ల్లో తనిఖీలు చేపట్టారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ పెంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా పోలీస్ బాస్ స్వయంగా రంగంలోకి దిగడంతో మండల, డివిజన్ స్థాయి పోలీస్ అధికారులు సైతం అప్రమత్తమయ్యారు. మొన్నటి వరకు కొన్ని మండలాల్లో చూసీచూడనట్లుగా వ్యవహరించిన పోలీస్ అధికారులు ఇప్పుడు గట్టి నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నారు.

చెక్‌పోస్టుల్లో నిశిత పరిశీలన..

కొత్త ఇసుక పాలసీ అమల్లోకి వచ్చేంతవరకు అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి గత నెలలో ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా అధికారులు అప్రమత్తమై ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టారు. కలెక్టర్, ఎస్పీ చర్ల మండలంలోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. పరిమితికి మించి ఇసుక రవాణా చేయకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వే బిల్లులు నిశితంగా పరిశీలించేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అక్కడ పోలీసులకు డ్యూటీ వేసి రేయింబవళ్లు నిఘా పెంచారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల, డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించారు. రాత్రిళ్లు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, ఇసుక అక్రమంగా తరలించే వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. గోదావరి, కిన్నెరసాని పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ఎస్పీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, పాల్వంచ, ముల్కలపల్లి, అశ్వారావుపేట మండలాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

కందకాలు తవ్వించి..

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లో కందకాలు తవ్వించారు. గతంలో కూడా ఇలా తవ్వినా.. అక్రమార్కులు వాటిని పూడ్చి ఇసుక తరలించేవారు. ప్రస్తుతం ఉన్నతాధికారుల నిఘాతో కందకాల పూడ్చివేతకు వెనుకాడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో రూ.లక్షలు ఆర్జిస్తున్న వారికి అధికారుల చర్యలు మింగుడు పడటం లేదు. దీంతో కొందరు రాజకీయ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మండల స్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చేలా ప్రయత్నిస్తున్నారు. అయితే అక్రమ రవాణాను అడ్డుకోవాలని సీఎం ఆదేశించడంతో ప్రజాప్రతినిధులు కూడా అధికారులపై ఒత్తిడి చేయలేకపోతున్నారు.

15 రోజుల్లో 66 మందిపై కేసులు..

జిల్లాలో గత 15 రోజుల వ్యవధిలో పలు మండలాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 34 వాహనాలను సీజ్ చేసిన అధికారులు.. 66మందిపై కేసులు నమోదు చేశారు. దీంతో నదులు, వాగుల నుంచి అక్రమంగా రవాణా చేసేందుకు పలువురు భయపడుతున్నారు. అయితే గతంలో అక్రమంగా నిల్వచేసిన రాశుల నుంచి రాత్రిళ్లు అవసరమైన వారికి సరఫరా చేస్తున్నారు. ఇలా జిల్లాలో భారీగా ఇసుక అక్రమ నిల్వలున్నాయి. వీటిపై కూడా అధికారులు దృష్టి పెడితే అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. మండల, డివిజన్ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

– రోహిత్ రాజ్, ఎస్పీ

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయాలి

- ఏజెన్సీ సత్తాను ప్రపంచ దేశాలకు చాటాలి
- ఓఎస్‌డీ పరితోష్ పంకజ్



పోటీలను ప్రారంభిస్తున్న ఓఎస్‌డీ పరితోష్ పంకజ్

చర్ల: ఏజెన్సీలో ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు ఉన్నారని, వారిలోని క్రీడా ప్రతిభను వెలికి తీయాలన్న సంకల్పంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఓఎస్‌డీ పరితోష్ పంకజ్ అన్నారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు తమ క్రీడా సత్తాను ప్రపంచ దేశాలకు చాటేలా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. చర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ క్రికెటర్, ఇండియా టీంకు కెప్టెన్‌గా వ్యవహరించిన మహేందర్ సింగ్ దోనీ జార్ఖండ్‌లోని మారుమూల గ్రామానికి చెందిన వాడైనప్పటికీ ఆయనలోని క్రీడా సత్తాను ప్రపంచ దేశాలకు చాటిచెప్పాడని అన్నారు. అదే విధంగా భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష మహిళ క్రికెట్ టీంలో ఇండియా తరఫున ఆడి ఘన విజయం సాదించిందని గుర్తు చేశారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఏజెన్సీలోని ప్రతీ క్రీడాకారుడు ఉత్సాహంగా ముందుకు సాగాలన్నారు. ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ క్రీడా సత్తా ఉండి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి వారిని ఉన్నత శిఖరాలను చేర్చేందుకు ఎస్పీ రోహిత్ రాజ్ నేతృత్వంలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని, వారి గ్రామాల్లో విద్య, వైద్యం, రహదారులు, కమ్యూనికేషన్ వంటి సౌకర్యాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ పోటీలకు చర్ల మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ధర్మారం, టేకులేరు, జరుపల్లి, జీడిపల్లి, పెదు ఉట్లపల్లి గ్రామాలకు చెందిన 49 జట్లు హాజరయ్యాయి. సీఐ ఎ.రాజువర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ రాజ్‌కుమార్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనకు సర్వే

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల్లో మౌలిక భాష, గణిత అభివృద్ధి ప్రక్రియ ద్వారా సాధించిన ఫలితాలను అంచనా వేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వే చేస్తున్నట్లు సర్వే సమన్వయకర్త, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలల్లో సర్వే ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే 55 మంది క్షేత్ర పరిశీలకులను గుర్తించి 6వ తేదీ నుంచి రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ సర్వేలో భాగంగా రెండో తరగతి విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో సామర్థ్యాలను పరిశీలించి ఒక అంచనాకు వస్తారని, ఈ సర్వే మొత్తం ‘టాన్జరిన్’ అనే మొబైల్ యాప్ ద్వారా జరుగుతుందని వివరించారు. ఎంపిక చేసిన 50 పాఠశాలల్లో రెండో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ప్రత్యేక విధానం ద్వారా ఎనమిది మంది పిల్లలను గుర్తించి, వారికి మాత్రమే పరీక్ష నిర్వహిస్తామని, ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఫలితాలను విశ్లేషిస్తామని పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సా॥) 6.22

సహర్ (శుక్రవారం ఉ॥) 5.07

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



కల్యాణక్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామయ్య సన్నిధిలో ఎంపీ..

శ్రీ సీతారామచంద్రస్వామి వారిని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ బుధవారం దర్శించుకున్నారు. అనంతరం శ్రీరామనవమి ఏర్పాట్లు, ఆలయ అభివృద్ధి ప్రణాళికలపై ఈఓ రమాదేవితో సమీక్షించారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీలో 50 పోస్టుల భర్తీకి కంపెనీ బాధ్యులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఫార్మసిస్ట్, ట్రెయినీ ఫార్మసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్ పోస్టులకు అర్హులను ఎంపిక చేస్తారని, అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

‘పది’ పరీక్షలపై ఆకాశవాణిలో అవగాహన

చుంచుపల్లి: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు సబ్జెక్ట్ నిపుణులతో అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం ప్రోగ్రాం హెడ్ బైరి శ్రీనివాసన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాల్సిన తీరు, మంచి మార్కులు సాధించేలా చదవడంలో మెళకువలు తెలియజేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు 6వ తేదీన తెలుగు, 7న హిందీ, 10న ఇంగ్లిష్, 11న గణితం, 12న ఫిజికల్ సైన్స్, 13న బయోలాజికల్ సైన్స్, 15న సాంఘిక శాస్త్రం నిపుణులు ఉదయం 10 గంటలకు సూచనలు చేస్తారని వెల్లడించారు.

ఈనెల 10న ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ విడుదల చేసిన మొదటి ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌కు సంబంధించి టెక్నికల్ పరీక్షలు గతేడాది జూన్‌లో నిర్వహించిన విషయం విదితమే. ఆ పరీక్షలో మెరిట్ సాధించిన కొంతమంది జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వగా మిగిలిన మరో 36 మందికి ఈనెల 10వ తేదీన కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని యాజమాన్యం బుధవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. సంబంధిత అభ్యర్థులకు ఇప్పటికే సమాచారం అందించామని పేర్కొంది.

సౌర విద్యుత్ ప్లాంట్లకు 139 దరఖాస్తులు

ఖమ్మంవ్యవసాయం: బీడు, బంజర భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ముందుకొస్తున్నారు. భూముల్లో ప్లాంట్లు ఏర్పాటుచేయడం ద్వారా ఆదాయం పొందేలా రైతులను కేంద్రప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. పీఎం కుసుమ్ పథకం కింద 500కిలోవాట్లు మొదలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశముండగా, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్‌తో డిస్కంలు కొనుగోలు చేస్తాయి. ఈ పథకం కోసం దరఖాస్తు గడువును 10వ తేదీ వరకు పొడిగించిన నేపథ్యాన బుధవారం వరకు 139 దరఖాస్తులు అందాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 38, ఖమ్మం జిల్లా నుంచి 101దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందాయని రెడ్‌కో ఉమ్మడి జిల్లా మేనేజర్ పోలిశెట్టి అజయ్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

సంస్కృతానికి బదులు తెలుగు ప్రశ్నపత్రం

ఇల్లెందు: పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థిని సుదిమళ్ల గురుకులంలో ఇంటర్ పరీక్షకు హాజరైంది. ఆమె ద్వితీయ భాష సంస్కృతం కాగా, హాల్‌టికెట్‌లో తెలుగు అని ప్రింట్ అయింది. పరీక్ష నిర్వాహకులు దాని ప్రకారం తెలుగు ప్రశ్నపత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని బాలిక నిర్వాహకుల దృష్టికి తేగా.. వారు వెంటనే సదరు కళాశాలకు సమాచారం అందించి వివరాలు తెలుసుకున్నారు. హాల్‌టికెట్‌లో తప్పిదం జరిగిందని గ్రహించి తిరిగి సంస్కృత ప్రశ్నపత్రం అందజేశారు. ఈ విషయమై గురుకులం ప్రిన్సిపాల్ రత్నకుమారిని వివరణ కోరగా హాల్‌టికెట్‌లో జరిగిన తప్పిదాన్ని గ్రహించి సంస్కృతం పేపర్ ఇచ్చామని చెప్పారు.

ఉద్యోగం ఇప్పించాలంటూ దివ్యాంగుడి భిక్షాటన


రోడ్డుపై యాచిస్తున్న దివ్యాంగుడు

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలో వాల్ ఆపరేటర్‌గా పనిచేసే తనను ఉద్యోగం నుంచి అకారణంగా తొలిగించారని, తిరిగి ఉద్యోగం ఇవ్వాలని తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని విఠల్‌రావు నగర్‌కు చెందిన దివ్యాంగుడు రావుల కుమారస్వామి పూలమార్కెట్ చౌరస్తాలో భైఠాయించి యాచిస్తూ నిరసన తెలియజేశాడు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ దివ్యాంగుడిని పిలిపించి 15వ తేదీ కల్లా ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించాడు. తనను మున్సిపాలిటీలోని కొందరు వ్యక్తులు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి

డీఆర్‌డీఓ విద్యాచందన


వీసీకి హాజరైన విద్యాచందన తదితరులు

చుంచుపల్లి: ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరినందున బ్యాంక్ లింకేజీ రుణాలు, దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీ వంటి లక్ష్యాలను పూర్తి చేయాలని డీఆర్‌డీఓ విద్యాచందన సిబ్బందికి సూచించారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ బుధవారం డీఆర్‌డీఓ, సెర్ప్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, ఆ తర్వాత విద్యాచందన జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ, పాత బకాయిల రికవరీ, దివ్యాంగులకు స్మార్ట్ కార్డుల జారీ, పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఈ ఏడాది లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

ఆస్పత్రిలో వసూళ్ల ఆరోపణపై విచారణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణి.. ఆస్పత్రి సిబ్బందితో తాను ఎదుర్కొన్న సమస్యలపై వాట్సప్‌లో ఫిబ్రవరి 6వ తేదీన పోస్ట్ చేసిన ఓ వీడియో వైరల్‌గా మారిన విషయం విదితమే. మణుగూరు మండలానికి చెందిన గర్భిణి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ప్రసవం కోసం రాగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆమెతో ప్రవర్తించిన తీరు, ప్రసవ సమయాన ప్రతీ చిన్న పనికి కూడా లంచం ఇవ్వాల్సిందేనని, లేకుంటే సిబ్బంది రోగుల పట్ల వ్యవహరించిన తీరుపై ఫిబ్రవరి 7న డీసీహెచ్‌ఎస్ రవిబాబు ఆదేశాల మేరకు బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు రెండు రోజుల పాటు విచారణ చేసి జిల్లా అధికారులకు నివేదిక అందజేశారు. కాగా ఈ ఘటనకు సంబంధించి వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ హైదరాబాద్ నుంచి మంగళవారం మణుగూరు వెళ్లి బాధితురాలిని కలిసి ఘటనపై ఆరా తీసి వివరాలు నమోదు చేశారు. విచారణలో భాగంగా బుధవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి చేరుకొని ఘటన చోటుచేసుకున్న సమయంలో విధుల్లో ఉన్న వైద్యులు, సిస్టర్లు, శానిటేషన్, పేషెంట్ కేర్, ఓటీ అసిస్టెంట్‌తో పాటు ఇతర సిబ్బందితో లిఖిత పూర్వక స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఐదుగురికి గాయాలు

పాల్వంచరూరల్: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన ఘటన మండలంలోని జగన్నాథపురంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎం.భగవాన్‌కు కాలు విరగగా, మరో బైక్‌పై వస్తున్న భార్యాభర్తలు ఎం.శ్రీనివాస్, సుబ్బలక్ష్మి, పిల్లలు అంజలి, నాగలక్ష్మి గాయపడ్డారు. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

ప్రోత్సాహం దూరమై.. పెట్టుబడి భారమై..

- ఊతమివ్వని సమీకృత ఉద్యాన అభివృద్ధి కార్యక్రమం
- భారంగా మారిన కూరగాయల సాగు
- ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటల వైపే రైతుల దృష్టి
- వినియోగదారులకు తప్పని ధరాభారం


కాకర సాగుకు ఓ రైతు సిద్ధం చేసిన భూమి

ఇల్లెందురూరల్: కూరగాయల సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నేళ్లుగా సబ్సిడీలు ఎత్తివేయడంతో జిల్లాలో ఆ పంటలపై రైతులు ఆసక్తి చూపడం లేదు. కేంద్రం గతేడాది సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం ప్రకటించినా అధికారులు అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఇతర పంటలనే సాగు చేస్తున్నారు.

రోజుకు 266 టన్నులు..

జిల్లాలో 13.34 లక్షలకు పైగా జనాభా ఉంది. ఒక్కో వ్యక్తి నిత్యం 200 గ్రాముల చొప్పున జిల్లాలో 266 టన్నుల కూరగాయలు అవసరం. ఇందుకోసం సమారు మూడు వేల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే గతంలో కూరగాయల సాగుకు సబ్సిడీపై నాణ్యమైన ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు అందించారు. దీంతో రైతులు విస్తృతంగా సాగు చేశారు. 2016 నుంచి సబ్సిడీ విత్తనాలకు మంగళం పాడడంతో సాగు 40 శాతానికి పడిపోయింది. గత నాలుగేళ్లుగా చీడపీడలు విజృంభించడంతో సాగు విస్తీర్ణం మరింత తగ్గిపోయింది. ఏటా 500 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగయ్యే ఇల్లెందు మండలంలో గతేడాది పూర్తిగా పడిపోయింది. కాగా కేంద్ర ప్రభుత్వం 2024 వానాకాలం, ప్రస్తుత యాసంగి సీజన్‌కు సమీకృత ఉద్యాన అభివృద్ధి కార్యక్రమం అమల్లోకి తెచ్చింది. ఇందుకోసం రాష్ట్రానికి రూ.145 కోట్లు కేటాయించి కూరగాయల సాగును ప్రోత్సాహించాలని నిర్ణయించింది. రాష్ట్రానికి మంజూరు చేసిన నిధుల్లో జిల్లాకు రూ.4.50 కోట్లు వచ్చే అవకాశం ఉంది. కానీ అధికారులు దీనిపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడం లేదు. దీంతో జిల్లాలో కూరగాయల సాగు అంతగా లేక వినియోదారులపై భారం పడుతోంది.

ప్రోత్సహిస్తే కాకరసాగు..

కూరగాయల సాగులో కాకరను రైతులు తొలిపంటగా భావిస్తారు. ఏప్రిల్‌లో విత్తనాలు వేస్తే జూన్ రెండో వారం నుంచి పంట దిగుబడి ప్రారంభమవుతుంది. ఈ పంట సాగుకు పందిరి వేసేందుకు గతంలో అడవి నుంచి వాసాలు తెచ్చి పందిర్లు వేసేవారు. ప్రస్తుతం వాసాల సేకరణకు అటవీ శాఖ అధికారులు అడ్డుపడుతున్నారు. కనీసం వెదురు బొంగులు కూడా తీసుకురానివ్వడం లేదు. దీంతో రైతులు సిమెంట్ స్తంభాలు కొనుగోలు చేయలేక ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. గతంలో సిమెంట్ స్తంభాల కొనుగోలుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. కానీ ఆ పథకం ప్రస్తుతం అమల్లో లేకపోవడంతో కాకర సాగు చేసే రైతులు పునరాలోచనలో పడినట్లుగా తెలుస్తోంది.

ప్రోత్సాహకాలు పునరుద్ధరించాలి



మాకు కూరగాయల సాగు వారసత్వంగా వస్తోంది. దశాబ్దాలుగా ఈ పంటనే నమ్ముకొని జీవిస్తున్నాం. రాయితీ సౌకర్యాలు దూరం కావడం, చీడపీడలు అధికం కావడంతో ఇప్పుడు పంట సాగు భారంగా మారింది. సబ్సిడీలు పునరుద్ధరించి, మార్కెట్ సౌకర్యం కల్పిస్తే కొంతైనా మేలు జరుగుతుంది. – వాంకుడోత్ లింగా, అమర్‌సింగ్‌తండా, ఇల్లెందు మండలం

ఉద్యాన అధికారుల జాడేలేదు



దశాబ్దకాలంగా కూరగాయలు సాగు చేస్తున్నాం. గతంలో ఉద్యాన రైతులు నిరంతరం పర్యవేక్షించేవారు. మూడేళ్లుగా వారి జాడే లేదు. చీడపీడలు అధికమై, దిగుబడి తగ్గి గతేడాది సాగు నిలిపివేశాం.

– వాంకుడోత్ బాలు, కొమరారం, ఇల్లెందు మండలం

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

సమీకృత ఉద్యాన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లాకు మంజూరైన నిధులను బొప్పాయి, జామ, సీతాఫలం సాగుకు అత్యధికంగా కేటాయించాం. రెండు మండలాల్లో ఆరెకరాల విస్తీర్ణంలో కూరగాయల పందిరి సాగుకు మంజూరు చేశాం. మరింత మంది రైతులకు ప్రోత్సాహకాలు అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– కిషోర్, జిల్లా ఇన్‌చార్జ్ ఉద్యాన అధికారి

గద్దెపైకి పగిడిద్దరాజు

యాపలగడ్డలో జాతర ప్రారంభం


గుడివద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గుండాల: గుట్ట నుంచి తీసుకొచ్చిన పగిడిద్దరాజు గర్భగుడిలో పూజలందుకుని గద్దెనెక్కాడు. డోలి చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ పగిడిద్దరాజును గద్దెపై ప్రతిష్ఠించారు. మేడారం సమ్మక్క భర్త, యాపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయుడు పగిడిద్దరాజు జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామానికి చెందిన పూజారులు, వడ్డెల ఆధ్వర్యంలో పగిడిద్ద రాజును గుట్టనుంచి పగడాలను(జెండాలు) స్థానిక గద్దెల వద్దకు చేర్చారు. ముందుగా గర్భగుడి వద్ద ఆభరణాలకు, శివ సత్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పగిడిద్దరాజును డప్పువాయిద్యాలు, గిరిజన నృత్యాలతో ఊరేగింపుగా గద్దెల వద్దకు చేర్చి ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక పూజలతో గద్దెలపై ప్రతిష్ఠించారు. గురువారం వనం(దేవత) రాకతో నిండు జాతర ప్రారంభమవుతుంది. సాయంత్రం గ్రామంలో జోగుకు వెళ్లి, అదే రాత్రి దేవతలకు గంగాస్నానం చేయిస్తారు. పగిడిద్దరాజు–సమ్మక్క దేవతలకు నాగవెల్లి జరుపుతారు. శుక్రవారం తెల్లవారుజామున గుడి మెలిగి, దేవతలకు శ్రేలపెయ్యను హారంగా ఇస్తారు. ఉదయం నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం తిరిగి దేవతను గుట్టకు చేర్చడంతో జాతర ముగుస్తుంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పూజారులు లక్ష్మినర్సు, లచ్చుపటేల్, పెద్ద కాంతారావు, చిన్న కాంతారావు, సత్యం, లక్ష్మయ్య, సమ్మయ్య, సత్యం, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆలోచనలే భవిష్యత్‌కు పునాదులు

గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ


మాట్లాడుతున్న మణెమ్మ

దుమ్ముగూడెం : ప్రతి విద్యార్థి లక్ష్యసాధన కోసం పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, వారి ఉన్నతమైన ఆలోచనలే భవిష్యత్‌కు పునాదులని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ అన్నారు. బుధవారం లక్ష్మీనగరం రేగుబల్లి 1 గిరిజన బాలికల పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మణెమ్మ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో చదువుతున్న 8, 9,10 తరగతుల విద్యార్థుల ఆలోచనకు పదును పెట్టేందుకు ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ కార్యక్రమం చేపట్టారని వివరించారు. ప్రతి విద్యార్థి లక్ష్యసాధన కోసం కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్, ఎంఈఓ సున్నం సమ్మయ్య, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. సావిత్రి, ఎస్సై వెంకటప్పయ్య, దుమ్ముగూడెం వైద్యాధికారి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు.. ఇంకొన్ని మళ్లింపు

ఖమ్మం రాపర్తినగర్: కాజీపేట–విజయవాడ మార్గంలో నిర్మిస్తున్న మూడో రైల్వే లైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈనేపథ్యాన పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు ఇంకొన్నింటిని దారి మళ్లించినట్లు ఖమ్మం రైల్వే అధికారి కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ తెలిపారు.

రద్దయిన రైళ్ల ఇవే...

రైలు నంబర్	పేరు / మార్గం	రద్దయిన తేదీలు
67767	డోర్నకల్ – విజయవాడ (పుష్‌పుల్)	ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు
67768	విజయవాడ – డోర్నకల్	
67215	విజయవాడ – భద్రాచలం రోడ్	
67215	భద్రాచలం రోడ్ – విజయవాడ	
12705	గుంటూరు–సికింద్రాబాద్ (ఇంటర్‌సిటీ)	
12706	సికింద్రాబాద్ – గుంటూరు (ఇంటర్‌సిటీ)	
12713	విజయవాడ – సికింద్రాబాద్ (శాతవాహన)	
12714	సికింద్రాబాద్ – విజయవాడ (శాతవాహన)	
12701	గుంటూరు – సికింద్రాబాద్ (గోల్కొండ)	
12702	సికింద్రాబాద్ – గుంటూరు (గోల్కొండ)	
07481	తిరుపతి – సికింద్రాబాద్ (స్పెషల్)	ఈనెల 9న
07482	సికింద్రాబాద్ – తిరుపతి (స్పెషల్)	ఈనెల 10న
22645	ఇండోర్ – కొచివిల్	ఈనెల 10న
22646	కొచివిల్ – ఇండోర్	ఈనెల 8న
22647	కోర్బా – కొచివిల్	ఈనెల 12న
22648	కోచివిల్ – కోర్బా	ఈనెల 10న
12511	గోరఖ్‌పూర్ – కోచివిల్ (రప్తీసాగర్)	ఈనెల 6, 7, 9
12512	కోచివిల్ – గోరఖ్‌పూర్ (రప్తీసాగర్)	ఈనెల 9, 11, 12
04717	హిస్సార్–తిరుపతి (స్పెషల్)	ఈనెల 8న
07418	తిరుపతి–హిస్సార్ (స్పెషల్)	ఈనెల 10న

దారి మళ్లించిచేవి...

20805, 20806 విశాఖ – ఢిల్లీ, ఢిల్లీ – విశాఖకు రైళ్లను 11, 12వ తేదీల్లో దారి మళ్లిస్తారు. అలాగే, 20803, 20804 విశాఖ – గాంధీధమ్, గాంధీధమ్ – విశాకు వెళ్లే రైళ్లను 6, 9వ తేదీల్లో, శాలిమార్ – హైదరాబాద్, హైదరాబాద్ – శాలిమర్ ఎక్స్‌ప్రెస్(ఈస్ట్‌కోస్ట్)ను 11, 12, 13వ తేదీల్లో, భువనేశ్వర్ – ముంబై, ముంబై – భువనేశ్వర్ (కోణార్క్) ఎక్స్‌ప్రెస్‌ను 11, 12వ తేదీల్లో, సాయినగర్ – కాకినాడ రైలును 11, 12 తేదీల్లో దారి మళ్లించారు.

పథకాల అమలుకు సమష్టిగా శ్రమించాలి

జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

మణుగూరు రూరల్/కరకగూడెం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలుకు అన్ని విభాగాల అధికారులు సమష్టిగా శ్రమించాలని జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికలతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలులో మండల పరిషత్‌లే కీలకమన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సమీక్ష నిర్వహించి, వాటిని అమలుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన..

మండలంలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీ పరిధిలో గల గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలను నాగలక్ష్మి పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆహార పదార్థాలు బాగున్నాయని వర్కర్లను అభినందించారు. విద్యార్థుల ఆరోగ్యంతో పాటు ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.రాఘవరెడ్డి తదిరతులు పాల్గొన్నారు. అనంతరం పినపాక, కరకగూడెం మండలాల్లోనూ సీఈఓ పర్యటించారు. వేసవికాలం సమీపిస్తున్నందు నర్సరీల్లో మొక్కలకు సకాలంలో నీరందించాలని సిబ్బందికి సూచించారు. పద్మాపురం, కరకగూడెం పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఎంపీడీఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

ఖమ్మం వన్‌టౌన్/ముదిగొండ: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం హైదరాబాద్ హెలీకాప్టర్‌లో ముదిగొండ చేరుకోనున్న ఆయన ముదిగొండ–వల్లభి రహదారిలో ముదిగొండ నుంచి 5కి.మీ. మేర రూ.28కోట్ల వ్యయంతో నిర్మించే నాలుగు లేన్ల రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, మరికొన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాక ఖమ్మం వస్తారు. ఖమ్మంలో డిప్యూటీ సీఎం వ్యక్తిగత సహాయకుడు టి.శ్రీనివాసరావు దశదినకర్మతో పాటు ఇతర కార్యక్రమాలకు హాజరయ్యాక భట్టి హైదరాబాద్ బయలుదేరతారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వచ్చే హెలీకాప్టర్ ల్యాండింగ్ కోసం ముదిగొండ శివారు యడవల్లి రహదారిలోని ఓ ఖాళీ స్థలాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. అక్కడ హెలీప్యాడ్‌ఏర్పాటు, పోలీస్ బందోబస్తును ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ముదిగొండ సీఐ మురళి, తహసీల్దార్ సునీత ఎలిజబెత్ పరిశీలించగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

121 డిగ్రీ కళాశాలల ఫలితాలు నిలిపివేత

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను మంగళవారం రాత్రి విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో 304ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ గురుకుల డిగ్రీ కళాశాలలు ఉండగా, ఇందులో 121 ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు యూనివర్సిటీ డీన్ అకడమిక్‌కు వివిధ రకాల ఫీజులు బకాయి పడ్డారు. దీంతో ఆయా కాలేజీల ఫలితాలను యూనివర్సిటీ అధికారులు నిలిపివేశారు. డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు మొదలయ్యే సమయాన్ని ఫీజు చెల్లించాల్సి ఉన్నా కళాశాలల యాజమాన్యాల బాధ్యులు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిసి సమయం కోరారు. దీంతో 15 – 20 రోజుల గడువు ఇచ్చినా చెల్లించకపోగా జవాబుపత్రాల మూల్యాంకనం సమయంలో నోటీసులు పంపారు. దీంతో కొన్ని కళాశాలల యాజమాన్యాలు చెల్లించినా ఇంకా 121 కళాశాలల బాధ్యులు స్పందించలేదు. ఈమేరకు ఆయా కళాశాలల్లో విద్యార్థుల ఫలితాలను వెల్లడించలేదు. ఈమేరకు విద్యార్థులు ఆందోళనకు గురవుతుండగా, యాజమాన్యాల బాధ్యులు బుధవారం రిజిస్ట్రార్ రామచంద్రాన్ని కలిస్తే ఆయన వీసీ దృష్టికి తీసుకెళ్తానని బదులిచ్చారు. ఈ విషయమై కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ వివరణ కోరగా ఫీజులు చెల్లిస్తేనే ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

ఏరియా ఆస్పత్రిలో పెట్రోల్ బాంబు కలకలం


నిప్పంటించడంతో సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట నల్లగా మారిన టైల్స్

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మంగళవారం అర్ధరాత్రి కొందరు పెట్రోల్ బాంబులతో దాడి చేశారని సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ స్పష్టత ఇచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి తన చాంబర్ ఎదుట పెట్రోల్ పోసి నిప్పంటించాడని, ఈ దృశ్యం సీసీ కెమెరాలో రికార్డ్ అయిందని తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటన జరిగిన తీరును సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారా పరిశీలించి, వివరాలు సేకరించారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ చర్యకు పాల్పడింది భద్రాచలం పట్టణానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు సమాచారం.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు


పినపాక మండలంలో వేసిన పోస్టర్

పినపాక/గుండాల/కొత్తగూడెంఅర్బన్ : మావోయిస్టులకు వ్యతిరేకంగా ట్రైబల్ యూత్ అసోసియేషన్ పేరుతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు వెలిశాయి. పినపాక మండలం పిట్టతోగు, ఎర్రకుంట, చింతలపాడు, సుందరయ్య నగర్, గుండాల మండలం సాయనపల్లి, వెంకటాపురం, దామరతోగు, లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి క్రాస్ రోడ్డు, రేగళ్ల, గట్టుమల్ల, బంగారుచెలక గ్రామాల్లో పోస్టర్లు దర్శనమిచ్చాయి. 'శాంతియుత జీవనం మన హక్కు, అనుమానితుల సమాచారం పోలీసులకు ఇద్దాం, మావోయిస్టులు వద్దు.. అభివృద్ధి ముద్దు' అనే నినాదాలు వాటిలో ఉన్నాయి. కాగా, విషయం తెలిసిన వెంటనే పోలీసులు పోస్టర్లను తొలగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబసభ్యుల ఆందోళన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం తెలగరామవరానికి చెందిన చంద్రగిరి సత్యనారాయణ(65)కు మంగళవారం కడుపునొప్పి రాగా కుటుంబసభ్యులు సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సత్యనారాయణ బుధవారం మృతి చెందాడు. దీంతో సత్యనారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ అన్న మరణించాడని సత్యనారాయణ సోదరుడు హరికృష్ణ ఆరోపించారు. ఈ క్రమంలో త్రీటౌన్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. గురువారం పోస్టుమార్టమ్ నిర్వహించిన అనంతరం మృతికి గల కారణాలు తెలుస్తాయని, ఈ ఘటనపై సత్యనారాయణ కుటుంబసభ్యులు ఇంకా ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్సై పురుషోత్తం తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


పోలీసులు పట్టుకున్న పశువులు

టేకులపల్లి: అక్రమంగా రవాణా చేస్తున్న పశువులను టేకులపల్లి పోలీసులు మండలంలోని తడికలపూడి క్రాస్‌రోడ్ వద్ద బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు కోడె దూడలు, రెండు ఆవులతో అనిశెట్టిపల్లి నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న టీఎస్04 యూడీ 1837 నంబర్ గల ట్రాలీని పట్టుకుని బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను పాల్వంచలోని అన్నపూర్ణ గో సంరక్షణ సమితికి అప్పగించామని చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామశివారులో మంగళవారం అర్ధరాత్రి ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో సున్నం బాలరాజు(41) అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ఉన్న బండ్ల ముత్తయ్యకు కాలు విరిగింది. సమాచారం అందుకున్న సీఐ అశోక్‌రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. బాలరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలరాజు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఉపాధ్యాయురాలు మృతి

నేత్రదానం చేసిన కుటుంబసభ్యులు


రంగు కోకిల (ఫైల్)

దమ్మపేట : దుస్తులు ఇస్త్రీ చేస్తున్న మహిళ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటన దమ్మపేటలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రంగు కోకిల(31) స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. పదేళ్ల క్రితం దమ్మపేటకు చెందిన రంగు భానుతో వివాహం జరగగా.. వారికి ఇద్దరు కుమార్తెలు ఖుషిక(8), భావన(6) ఉన్నారు. బుధవారం ఉదయం కోకిల పాఠశాలకు వెళ్లేందుకు కుమార్తెల దుస్తులను కరెంట్ ఐరన్ బాక్స్‌తో ఇస్త్రీ చేస్తుండగా షాక్‌కు గురైంది. కుటుంబసభ్యులు వెంటనే అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కోకిల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మేము సైతం ఫౌండేషన్ వారి అభ్యర్థన మేరకు కోకిల నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు డాక్టర్ అగర్వాల్ ఐ బ్యాంక్‌కు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఇల్లు

మణుగూరు టౌన్: మండలంలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన చింతల చినరాములు ఇల్లు బుధవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న రూ.15వేల నగదుతో పాటు సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రభుత్వం తమకు సాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.